సాక్షి
పల్నాడు
శనివారం, 22, ఏప్రిల్, 2023



త్రికోటేశ్వరా...

నరసరావుపేట రూరల్: త్రికోటేశ్వర స్వామిని రాష్ట్ర స్త్రీ,శిశు సంక్షేమ శాఖా మంత్రి కె.వి.ఉషా శ్రీచరణ్ శుక్రవారం దర్శించుకున్నారు. మంత్రికి అధికారులు స్వాగతం పలికారు.



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శుక్రవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.3,500, గరిష్ట ధర రూ.5,800, మోడల్ ధర రూ.4500 వరకు పలికింది.

జీరో కరోనా



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కరోనా పాజిటివ్ కేసులు ఒక్కటీ నమోదు కాలేదు. అలాగే ఎక్కడా కరోనా మరణాలు సంభవించ లేదు.

న్యూస్‌రీల్

రైతుభరోసాకు దరఖాస్తు చేసుకోండి

ప్రత్తిపాడు: రైతు భరోసా పథకానికి అర్హత ఉన్న రైతులు ఈ నెల 30వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని గుంటూరు ఏడీఏ జి. శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం మరోసారి రైతుభరోసా పోర్టల్‌ను ఓపెన్ చేయడం జరిగిందని, ఇప్పటివరకు రైతుభరోసా పథకం ద్వారా లబ్ధిపొందని కర్షకులు, అర్హత ఉన్న వారు ఎవ్వరైనా ఉంటే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

విజయకీలాద్రిపై తిరునక్షత్ర ఉత్సవాలు



తాడేపల్లిరూరల్: సీతానగరంలోని విజయకీలాద్రి పర్వతంపై శుక్రవారం నుంచి మంగళవారం వరకు తిరునక్షత్ర ఉత్సవములు నిర్వహిస్తున్నట్లు జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి మంగళ శాసనాలతో శుక్రవారం ఉదయం రామానుజుల వారికి తిరుమంజన సేవ నిర్వహించామన్నారు. అలాగే అలంకరణ, మల్లెపూలతో సహస్రనామార్చన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం తీర్థప్రసాద గోష్ఠితో కార్యక్రమం ముసిగిందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జీయర్ పాఠశాల వేద విద్యార్థులు, విజయకీలాద్రి అర్చకులు పాల్గొన్నారు.

25న ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్‌లో ఈనెల 25న హైదరాబాద్‌కు చెందిన ఇన్ఫోసోర్స్ సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ప్రభాకరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. మిషన్ ఆపరేటర్స్, టెక్నీషియన్స్ పోస్టులకు 18 ఏళ్ల నిండి టెన్త్, ఐటీఐ, డిప్లొమా (ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్, మెకానికల్) అర్హతలు గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లో అర్హతను బట్టి రూ.10 వేల నుంచి రూ.15వేల వరకు వేతనం ఉంటుందని, అనుభవం గల అభ్యర్థులకు ఎక్కువ వేతనం ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలు, పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో ఈనెల 25వ తేదీ ఉదయం 11 గంటలకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి ప్రభావతిని 70137 17319 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

తల్లి ఒడికి పసికందు



ప్రత్తిపాడు: మద్యం మత్తులో మందుకు డబ్బులు లేక ఏడాదిన్నర పసికందును తల్లికి తెలియకుండా అమ్మేసిన తండ్రి ఉదంతమిది. పోలీసుల చొరవతో 48 గంటలు గడవక ముందే పసికందు మళ్లీ తల్లి ఒడి చేరడంతో కథ సుఖాంతమైంది. కోయవారిపాలెంలో నివాసం ఉంటున్న వసంతరావు జాలరి. అతను చేపల కుంటలు చూసేందుకు రెండురోజుల క్రితం అద్దంకి వెళ్లాడు. పూర్తిగా మద్యం మత్తులో ఉన్న వసంతరావు అక్కడ స్నేహితుడు వీరాంజనేయులుకు తన ఏడాదిన్నర బిడ్డ ఏసురాజును అమ్మేశాడు. ఈ విషయం భార్య కొండమ్మకు చెప్పలేదు. ఈ నేపథ్యంలో బిడ్డ కనిపించడం లేదని వసంతరావు భార్య కొండమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ రవీంద్రబాబు 48 గంటలు కూడా గడవకముందే కేసును ఛేదించారు. వసంతరావు స్నేహితుడిని వీరాంజనేయులును తమదైన శైలిలో విచారణ చేయడంతో అతను పసికందును తీసుకొచ్చి పోలీసులకు అప్పగించాడు. దీంతో పోలీసులు పసికందును తల్లి చెంతకు చేర్చారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 523.70 అడుగుల వద్ద ఉంది. ఇది 156.1096 టీఎంసీలకు సమానంగా ఉంది. సాగర్ జలాశయం నుంచి కుడికాలువకి 5,088, ఎడమకాలువకు నీటిని నిలుపుదల చేశారు. ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పల్నాడు గడ్డ.. కందిపప్పు అడ్డ

- కందిపప్పు పరిశ్రమ కేంద్రంగా పల్నాడు
- వినుకొండ, మాచర్ల నియోజకవర్గాల్లో కందిపప్పు మిల్లులకు ప్రసిద్ధి
- 120కి పైగా మిల్లుల్లో రోజుకు నగటున 2,400 టన్నుల కందిపప్పు తయారీ
- దేశ వ్యాప్తంగా ఎగుమతులు

భారతీయ విందులందు దివ్యమైన అంశం ఏదైనా ఉందీ అంటే అది కచ్చితంగా ముద్ద పప్పన్నమే. తాత–అవ్వలకు మనవళ్లు కనిపించినప్పుడల్లా అడిగేది 'ఏరా! పప్పన్నం ఎప్పుడు పెడతున్నావ్?' అనే. వేడివేడి అన్నం–ముద్దపప్పు–అప్పుడే కాచిన నెయ్యి–దప్పళం ఈ నాలుగింటి రుచి అంత తేలిగ్గా మరవలేమన్నది చాలాపాటల్లో విన్నాం.. చూశాం. అలాంటి ముద్దపప్పుకు కావల్సిన శ్రేష్టమైన కందిపప్పు తయారీకి కేరాఫ్‌గా నిలుస్తోంది పల్నాడు. తెలుగు లోగిళ్లలోనే కాదు.. దేశ విదేశాలలో సైతం ఇక్కడి దాల్‌కు మంచి డిమాండ్ ఉండటం విశేషం.



దుర్గిలోని ఓ కందిపప్పు మిల్లులో నిల్వలు (ఇన్‌సెట్‌లో) జగనన్న గోరు ముద్ద పథకానికి సరఫరా చేస్తున్న కందిపప్పు ప్యాకెట్లు

సాక్షి, నరసరావుపేట: ప్రజలకు నిత్యావసరమైన కందిపప్పును అందుబాటులో ఉంచుతూ సరసమైన ధరను ఉండే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంస్కరణలను చేపట్టాయి. పోషక విలువలు సమృద్ధిగా ఉన్నటువంటి కందిపప్పు దేశవ్యాప్తంగా ప్రజలు అధికంగా వినియోగిస్తుంటారు. వరి పంటను దక్షిణ భారతదేశంలో, గోధుమలు ఉత్తర భారతదేశంలో అత్యధికంగా పండిస్తున్నప్పటికీ కందిపంట మాత్రం దేశం నలుమూలలా వినియోగంలో ఉండటం విశేషం. అలాంటి కంది పప్పు పరిశ్రమకు పల్నాడు ప్రాంతం కేంద్రంగా నిలుస్తోంది. జిల్లాలోని వినుకొండ, మాచర్ల నియోజకవర్గాలలో విరివిగా కందిపప్పు మిల్లులు ఉండగా, నరసరావుపేట, చిలకలూరిపేట, గురజాలలో సైతం ఓ మోస్తరుగా మిల్లులు పనిచేస్తున్నాయి. ఇక్కడి పప్పు మిల్లుల నుంచి రెండు తెలుగు రాష్ట్రాలు సహా దేశంలోని వివిధ రాష్ట్రాలకు కంది పప్పు ఎగుమతి అవుతోంది. కొన్ని దశాబ్దాల నుంచి ఈ పరిశ్రమ అంచెలంచెలుగా ఎదుగుతూ వేలాది మంది కార్మికులకు ఉపాధి కల్పించడమే కాకుండా పరోక్షంగా రవాణా రంగం కూడా అభివృద్ధి పథంలో నడిచేందుకు దోహదం చేస్తోంది. క్రమేపీ పల్నాడు గడ్డ కందిపప్పు పరిశ్రమల అడ్డాగా మారింది.

ఆరు వేల మందికి ఉపాధి

పల్నాడు ప్రాంతంలో కంది పంట 20 వేల హెక్టార్లకు పైగా సాగవుతోంది. స్థానికంగా వచ్చే కందులతో పాటు తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి కందులు తీసుకువచ్చి వినుకొండ, దుర్గి, మాచర్ల ప్రాంతాల్లో ఉన్న పప్పు మిల్లుల్లో ఆడించి కందిపప్పు తయారు చేస్తున్నారు. ఆంధ్రరాష్ట్రంలో అత్యధికంగా పల్నాడు ప్రాంతంలో సుమారుగా 120 నుంచి 150 మిల్లులు కొనసాగుతున్నాయి. ఒక్కొక్క మిల్లు మీద సుమారుగా 50 మందికి పైగా కార్మికులు, గుమ స్తా లు, టెక్నీషియన్ల కుటుంబాలు ఆధారపడి జీవిస్తుంటాయి. ఇలా ప్రత్యక్షంగా 6 వేలు, పరోక్షంగా వేల మందికి మిల్లులు ఉపాధి కల్పిస్తున్నాయి. సంవత్సరం పొడవునా కార్మికులకు ఉపాధి ఉంటుంది.

ప్రత్యేక బోర్డుకు చర్యలు తీసుకోవాలి

ఆటుపోట్లు ఎదుర్కొంటూ మిల్లులు నిర్మించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు లక్షలాది రూపాయలను పన్నుల రూపంలో ఆదాయం కల్పిస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి నిర్దిష్టమైన ప్రణాళికలు లేకపోవడంతో ఒడిదుడుకులు ఎదుర్కోవాల్సి వస్తోందని మిల్లుల యజమానుల వాపోతున్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), పొగాకు బోర్డు, సుగంధ ద్రవ్యాల బోర్డు (స్పైసెస్) వలె కంది పంటకు ప్రత్యేక బోర్డును ఏర్పాటు చేసి రైతులకు, వ్యాపార వర్గాలకు చేయూతనివ్వాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వంపై ఉంది. కేంద్ర ప్రభుత్వం బర్మా, ఆఫ్రికా దేశాలతో ఎంఓయు ఒప్పందాలు ఏర్పాటు చేసుకున్నాయి. పల్నాడు ప్రాంతంలో ఏర్పాటు చేసిన కంది పప్పు మిల్లులకు గత ప్రభుత్వంలో లో ఓల్టేజీతో ఎన్నోసార్లు మిషన్లు పాడైపోయేవి. ప్రస్తుత ప్రభుత్వం హయాంలో ఇండస్ట్రియల్ ఫీడింగ్ ఏర్పాటు చేశారు.

వివిధ రాష్ట్రాలకు సరఫరా

రోజుకు సగటున 1,500 టన్నుల దాకా మిల్లుల్లో కంది పప్పు తయారు అవుతుంది. ఏడాదికి రూ.రెండు వేల కోట్లకు పైగా టర్నోవర్ ఉంటుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలు సహా, కర్ణాటక, మహారాష్ట్ర, బర్మా, ఆఫ్రికా దేశాల నుంచి ఇక్కడి మిల్లర్లు కందులు కొనుగోలు చేసి కంది పప్పు తయారు చేస్తారు. పల్నాడుకు చెందిన కంది పప్పు మిల్లర్లు, ట్రేడర్లు గత కొన్నేళ్లుగా ప్రభుత్వాలకు కంది పప్పు సరఫరా చేస్తూ వస్తున్నారు. జగనన్న గోరుముద్ద, ఏపీ, తెలంగాణ, తమిళనాడు, పుదుచ్చేరి, ఒడిశా రాష్ట్రాల పౌరసరఫరాల శాఖలకు కూడా ఇక్కడి మిల్లర్లు కందిపప్పు సరఫరా చేస్తుంటారు. కొన్నేళ్లుగా ఏపీలో పథకాలకు సరఫరా చేసే కంది పప్పు తయారీకి ప్రభుత్వమే కాంట్రాక్టులు పొందిన వారికి కందులు అందిస్తూ వస్తోంది. రైతుల నుంచి మార్కెటింగ్ కమిటీలు, మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన కందులను ప్రభుత్వం మిల్లర్లకు సరఫరా చేస్తోంది. మరోవైపు టీటీడీ దేవస్థానంలో ప్రసాదాల కౌంటర్‌కు సరఫరా చేసే టెండర్ దక్కించుకున్న బడా వ్యాపారస్తులు ఇక్కడి నుంచే ఎక్కువగా కందిపప్పుని కొనుగోలు చేస్తున్నారు.

వేగంగా అనుమతులు



పల్నాడు ప్రాంతంలో ఇప్పటికే పెద్ద సంఖ్యలో కంది పప్పు పరిశ్రమలు నెలకొని ఉన్నాయి. కొత్తగా ఏర్పాటు చేసుకోవాలనుకొనేవారికి కేవలం 21 రోజుల లోపే అన్ని అనుమతులు సింగిల్ డెస్క్ ద్వారా మంజూరు చేస్తున్నాం. అర్హులైన వారికి వివిధ పథకాల ద్వారా సబ్సిడీలను సైతం ప్రభుత్వం అందజేస్తోంది.

–వెంకటేశ్వరరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి

దేశవ్యాప్తంగా సరఫరా



రాష్ట్రంలోనే పల్నాడు ప్రాంతం కందిపప్పు మిల్లులకు ప్రసిద్ధిగాంచింది. ఇక్కడి కందిపప్పు దేశ వ్యాప్తంగా సరఫరా జరుగుతున్నాయి. అయితే కొన్ని సందర్భాల్లో లాభాలతో పాటు నష్టాలు కూడా రావడంతో రానురాను కందిపప్పు పరిశ్రమ ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది.

–చుండూరు పూర్ణచంద్రరావు, తిరుమల దాల్‌మిల్లు అధినేత, దుర్గి.

ప్రజారోగ్యమే ప్రభుత్వ పరమావధి

- శిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్
- పల్నాడు జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల ఆకస్మిక పరిశీలన

యడ్లపాడు/నాదెండ్ల: పౌష్టికాహార లోపం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ చెప్పారు. శుక్రవారం ఆమె చిలకలూరిపేట నియోజకవర్గంలోని నాదెండ్ల, యడ్లపాడు మండలాల్లో పర్యటించారు. నాదెండ్ల మండలం గణపవరం–14, మండల కేంద్రమైన యడ్లపాడులోని ఎస్టీ–4, తిమ్మాపురం ఎస్సీ–2 అంగన్‌వాడీ కేంద్రాల్ని సందర్శించారు. ఆయా కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్య, ఆరోగ్యం, సంపూర్ణ ఆహారం తయారీ, వైఎస్సార్ పౌష్టికాహారం కిట్ల పంపిణీ, మౌలిక సదుపాయాల కల్పన, పరిశుభ్రత, పారిశుద్ధ్యం, కేంద్రంలోని కార్యకర్తల పనితీరు, సూపర్‌వైజర్ల పర్యవేక్షణపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.

గణపవరంలో మంత్రి గరంగరం

ముందుగా గణపవరం అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ చిన్నారుల హాజరు పరిశీలించారు. ఉదయం 9 కావస్తున్నా రిజిస్టర్‌లో 14 చిన్నారులు నమోదు కాగా, వారిలో నలుగురు మాత్రమే ఎందుకు ఉన్నారంటూ మంత్రి ఆగ్రహించారు. అక్కడి నుంచి తిమ్మాపురం, యడ్లపాడు అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి తనిఖీలు చేశారు. కేంద్రంలోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు సిద్ధం చేసే భోజన గదుల్ని చూశారు.

బాధ్యత ప్రతి ఒక్కరిదీ

సమీకృత శిశు అభివృద్ధి కార్యక్రమం (ఐసీడీఎస్) ద్వారా మాతాశిశు సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి ఉషశ్రీచరణ్ తెలిపారు. కేంద్రాల పరిశీలన అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయన్నారు. దీంతో రక్తహీనతతో బాధపడేవారు అధికంగా ఉండి తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. గతంతో పోలిస్తే నేడు మాతాశిశు మరణాల సంఖ్య బాగా తగ్గిందన్నారు.



ఇఫ్తార్ విందు

చిలకలూరిపేట పట్టణంలోని అబ్బాస్‌నగర్‌లో రంజాన్ పర్వదినం సందర్భంగా శుక్రవారం సాయంత్రం భారీగా ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా మంత్రి విడదల రజిని పాల్గొన్నారు. ముందుగా ముఫ్తీ అనస్‌ఖాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. అనంతరం రంజాన్ పర్వదిన ప్రాశస్త్యాన్ని మంత్రి వివరించారు. ఎంతో నియమనిష్టలతో ఉపవాసాలు ఆచరించడం శుభదాయకమన్నారు. అనంతరం స్వయంగా సోదరులకు పదార్థాలను మంత్రి వడ్డన చేశారు.

–చిలకలూరిపేట

వడ్డెర సత్తెన్న విగ్రహావిష్కరణ చారిత్రాత్మకం

పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి, మంత్రి అంబటి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్సీలు

సత్తెనపల్లి: సత్తెనపల్లిలో పల్లపు సత్తెన్న విగ్రహావిష్కరణ నియోజకవర్గంలో చారిత్రాత్మకమని, రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి, పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరావు అన్నారు. ఈ సామాజిక వర్గాన్ని సంఘటితం చేసి ఇంతటి మంచి కార్యక్రమం నిర్వహించిన మంత్రి అంబటి రాంబాబు కృషి అభినందనీయమన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో శుక్రవారం రాత్రి సత్తెనపల్లి గడ్డ ఎత్తిన పల్లపు సత్తెన్న విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కారు మూరి మాట్లాడుతూ బీసీలలో చిట్ట చివరి సామాజిక వర్గానికి కూడా సామాజిక సమానత్వం అందించిన ఘనత యువ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికే దక్కిందన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకుంటున్న చంద్రబాబు వడ్డెర్లకు చట్టసభలలో అవకాశం కల్పించారా అని ప్రశ్నించారు. రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ సత్తెన్న విగ్రహావిష్కరణతో జన్మధన్యమైందని, నా హయాంలో సత్తెనపల్లి నియోజకవర్గంలో వడ్డెర సత్తెన్న విగ్రహావిష్కరణ చేసుకోవడం భవిష్యత్ తరాలకు చరిత్రను అందించటమేనన్నారు. నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ గతంలో లాగా బీసీలు బ్యాక్ వార్డ్ క్లాస్సెస్ కాదని జగనన్న పరి పాలనలో బ్యాక్ బోన్ మీరేనని పేర్కొన్నారు.

సన్మాన గ్రహీత చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వాతంత్ర చరిత్రలో వడ్డెర సామాజిక వర్గం చట్టసభల్లో అడుగుపెట్టడం ఇదే తొలిసారి అని, ఇది చారిత్రాత్మకమని, ముఖ్యమంత్రి జగన్ వల్లే సాధ్యమైందన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ రాజ్యాధికారానికి దూరంగా ఉన్న అట్టడుగు వర్గాలను గుర్తించి, వారికి అవకాశం ఇస్తూ ప్రోత్సహిస్తున్న జగన్‌కు అందరు అండగా ఉండాలన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ ఏసురత్నాన్ని స్ఫూర్తిగా తీసుకొని వడ్డెర్లు ఉన్నత స్థితికి చేరుకోవాలన్నారు.

గుంటూరు నగర మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళీమోహన్, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల నారాయణ, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దేవళ్ల రేవతి, విజయవాడ దుర్గ ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, డాక్టర్ గీతా హాసంతి, పెండెం బాబూరావు, బాసు లింగారెడ్డి, బత్తుల సాంబశివరావు, తన్నీరు శ్రీనివాసరావు, కందుల నాగేశ్వరరావులు మాట్లాడారు.

ఈ కార్యక్రమానికి పట్టణ వడ్డెర సంఘం అధ్యక్షులు వేముల వరప్రసాద్ అధ్యక్షత వహించగా నియోజవర్గ అధ్యక్షులు తన్నీరు శ్రీనివాసరావు ఆహ్వానం పలికారు. ముందుగా అతిథులకు భారీ ర్యాలీతో విగ్రహం వద్దకు తీసుకొచ్చి సత్తెన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. అంబటి ఆధ్వర్యంలో చంద్రగిరి యేసు రత్నమును అతిథులు ఘనంగా సత్కరించారు.

కార్యక్రమంలో నాయకులు చల్లంచర్ల సాంబశివరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, సత్తెన్న విగ్రహ దాత బత్తుల రామస్వామి, కర్నాటి రాంబాబు, చల్లా శ్రీనివాసరావు , పల్నాడు జిల్లా వైద్యుల విభాగం అధ్యక్షులు గజ్జల నాగభూషణ్ రెడ్డి ,జిల్లా మహిళా నాయకురాలు డా.గీతాహసంతి, వాణిజ్య విభాగం అధ్యక్షులు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, బీసీ సంఘం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యాహక్కు పేదలకు వరం

- పేద విద్యార్థులకు కార్పొరేట్ బడుల్లో 25 శాతం ఉచిత ప్రవేశాలు
- జిల్లాలో తొలివిడతలో 152 మంది విద్యార్థుల ఎంపిక
- 25లోగా ప్రవేశాల ప్రక్రియ పూర్తి
- 29న రెండోవిడత జాబితా విడుదల
- అభ్యంతరం పెట్టే పాఠశాలలపై చర్యలు తప్పవు: డీఈఓ శామ్యూల్

నరసరావుపేట ఈస్ట్: రాష్ట్రప్రభుత్వం తీసుకువచ్చిన విద్యా హక్కు చట్టం పేదలకు వరంగా మారింది. కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలు వసూలు చేస్తున్న అడ్డగోలు ఫీజులకు చెక్ పెడుతూ ఆయా పాఠశాలల్లో పేదలకు 25శాతం సీట్లు ఉచితంగా కేటాయించేలా ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టం పేదలకు మేలు చేకూరుస్తున్నది. 2023–24 విద్యా సంవత్సరంలో 1వ తరగతిలో కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో అర్హులైన విద్యార్థులకు ప్రవేశం కల్పించేందుకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను స్వీకరించి పాఠశాలల కేటాయింపును పాఠశాల విద్యాశాఖ పూర్తిచేసింది. సదరు విద్యార్థుల జాబితాను సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ అధికారులకు పంపుతూ అవసరమైన మార్గదర్శకాలను జారీ చేశారు. పారదర్శకతకు పెద్దపీట వేస్తు ప్రభుత్వం విద్యార్థుల జాబితాను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. ఆయా పాఠశాలలు సైతం తమ పాఠశాలలో ప్రవేశానికి అర్హత సాధించిన విద్యార్థుల వివరాలను నోటీస్ బోర్డులో ఉంచాలని ఆదేశించారు. ప్రవేశాలు పొందిన విద్యార్థుల వివరాలను ఎప్పటికప్పుడు విద్యాశాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

పల్నాడు జిల్లాలో 153 మందికి ప్రవేశాలు

జిల్లాలో 153 మంది పేద విద్యార్థులు వివిధ కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలలో విద్యాహక్కు చట్టం క్రింద ప్రవేశాలకు అర్హత సాధించారు. వీరికి ఆయా పాఠశాలల్లో పూర్తిగా ఉచితంగా విద్యను అందించాల్సి ఉంటుంది. వారికి అవసరమైన ఫీజులు, ఇతర సదుపాయాలకు అయ్యే మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుంది. తొలివిడతలో అచ్చంపేట 2 మంది, అమరావతి 5, బెల్లంకొండ4, చిలకలూరిపేట 9, దాచేపల్లి 6, దుర్గి 2, ఈపూరు 1, కారంపూడి 7, క్రోసూరు 10, మాచర్ల 11, నాదెండ్ల 1, ముప్పాళ్ల 5, నకరికల్లు 6, నరసరావుపేట 31, పిడుగురాళ్ల 8, రాజుపాలెం 3, రొంపిచర్ల 1, రెంటచింతల 5, సత్తెనపల్లి 25, శావల్యాపురం 1, వెల్దుర్తి 1, వినుకొండ 8 మంది విద్యార్థులు కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు అర్హత సాధించారు.

ఎంపికైన వారిని చేర్చుకోవాలి



విద్యాహక్కు చట్టం ద్వారా కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు అర్హత పొందిన విద్యార్థులను ఆయా పాఠశాలల యాజమాన్యాలు చేర్చుకోవాలి. అభ్యంతరాలు వ్యక్తం చేసి చేర్చుకోని పాఠశాలలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం. ప్రవేశాల ప్రక్రియను విద్యాశాఖాధికారులు 25వతేదీ లోగా పూర్తిచేయాలి. వివరాలను అప్‌లోడ్ చేయాలి.

–కె.శామ్యూల్, డీఈఓ

ఊహించని వరమిది



విద్యాహక్కు ద్వారా ప్రైవేటు పాఠశాలలో తమ చిన్నారి ప్రిన్సీసైనాను ఒకటో తరగతిలో చేర్పించిన తల్లి ఈశ్వరమ్మ ఆనందానికి అవధులు లేవు. తమ చిన్నారి సైనా ఎల్‌కెజీ, యూకేజీ చదువుకే వేల రూపాయలు ఫీజుల రూపంలో చెల్లించామని ఈశ్వరమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. జగనన్న ప్రభుత్వం వల్ల సాధ్యమైంది.

–జి.ఈశ్వరమ్మ, విద్యార్థిని తల్లి

సమాన సేవలతోనే ప్రగతిబాట

- కలెక్టర్ శివశంకర్ లోతేటి
- ఘనంగా సివిల్ సర్వీసెస్ డే



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్, చిత్రంలో జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాదు, డీఆర్వో వినాయకం

నరసరావుపేట: సమాజంలో అన్నివర్గాల ప్రజలకు సమాన సేవలను అందించడమే లక్ష్యంగా సివిల్ సర్వీస్ ఉద్యోగులు పని చేయడం ద్వారా జిల్లా ప్రగతికి బాటలు వేయవచ్చునని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన 16వ 'సివిల్ సర్వీసెస్ డే' వేడుకలకు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవెన్యూశాఖ అధికారి కె.వినాయకంలతో కలిసి కలెక్టర్ హాజరై మాట్లాడారు. గతంలో శాశ్వత శిస్తు వసూలు చేసే విధంగా జమిందారీ విధానం అమలులోకి వచ్చిందన్నారు. వారికే శాశ్వత హక్కు ఉండేదన్నారు. ఆ తర్వాత కాలంలో కలెక్టర్ వ్యవస్థను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. శిస్తు వసూలుతో అనేక బాధ్యతలను బ్రిటీష్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఆ తర్వాత కాలంలో మారిన పరిస్థితులు, జమిందారీ వ్యవస్థ, నూతనంగా ఏర్పాటైన పల్నాడు జిల్లా అనేక సవాళ్లను అధిగమిస్తూ ఏడాదిపాటు ప్రజలకు మెరుగైన సేవలను అందించడంలో దగ్గరయ్యామన్నారు.

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను సైతం నిర్విరామంగా అందిస్తూనే పల్నాడు జిల్లా ప్రగతికి అచంచలమైన విశ్వాసంతో పని చేస్తున్నామని సంతోషం వ్యక్తం చేశారు. ప్రజలకు మెరుగైన సామాజిక సేవలు అందించడానికి ప్రతీ ఉద్యోగి కృషి చేస్తున్న తీరు అభినందనీయమన్నారు. మనం అందిస్తున్న సేవలను ప్రజలు ఎప్పుడు చిరస్థాయిగా గుర్తుంచుకుంటారని వెల్లడించారు. ప్రభుత్వ అధికారులు నిస్వార్థంగా నిబద్ధతతో మంచి ఆలోచనలతో విధులు నిర్వహిస్తున్నందునే అభివృద్ధి సాధ్యపడుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

జిల్లాలో సివిల్ సర్వెంట్స్‌గా పనిచేస్తూ అందరికీ సుపరిపాలన అందిస్తున్న వారికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం నిర్ణయించిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు సమాజానికి తోడ్పడే విధంగా అమలు చేయడం ద్వారా సివిల్ సర్వెంట్స్ ప్రతిభ ప్రతిఫలిస్తుందన్నారు. అనంతరం ఉద్యోగులతో కలెక్టర్ 16 వ జాతీయ పౌర సేవల దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ మాట్లాడుతూ నేషనల్ సర్వీసెస్ డేకు ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. డీఆర్వో వినాయకం రెవెన్యూ సర్వీసెస్ డే సందర్భంగా పలు అంశాలను ప్రస్తావించారు.

వలకు చిక్కిన మొసలి



మాచవరం: పిల్లుట్ల గ్రామ శివారులోని సింగరాయపాలెం తండాకు వెళ్లే మార్గంలోని వాగులో వలకు మొసలి చిక్కింది. గ్రామానికి చెందిన కొందరు యువకులు శుక్రవారం చేపల కోసం వల వేయగా మొసలి చిక్కింది. విషయాన్ని వారు గ్రామ సచివాలయ అధికారులకు తెలియజేశారు. స్థానిక అధికారులు అందించిన సమాచారంతో అటవీశాఖ అధికారులు గ్రామానికి వచ్చి మొసలిని బంధించి, నాగార్జునసాగర్‌లోని సంరక్షణా కేంద్రానికి తరలించారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: ముస్లింలకు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శుక్రవారం రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అందరూ కలిసి మెలిసి ఉండాలని, కష్టం వచ్చినప్పుడు పొరుగు వారిని ఆదుకోవాలన్నదే సర్వ మతాలు సారాంశమన్నారు. భక్తి, ప్రేమ, త్యాగాల సమ్మిళితమే రంజాన్ అని, ప్రపంచ వ్యాప్తంగా ముస్లింలు జరుపుకునే పండుగ రంజాన్ అన్నారు.

అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

మంత్రి విడదల రజిని


చిలకలూరిపేట: ముస్లింలకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని రంజాన్ శుభాకాంక్షలు శుక్రవారం తెలిపారు. ఈ రంజాన్ అందరిజీవితాల్లో సంతోషాలను, సంపదలను కలగజేయాలని ఆకాంక్షించారు. మత సామరస్యానికి ప్రతీక అయిన రంజాన్ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

అల్లా ఆశీస్సులు పొందాలి

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

మాచర్ల: ముస్లింలు రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకుని తోటి వారితో ప్రేమాభిమానాలు చూపాలని ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. ప్రతి ముస్లిం కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రజలంతా శాంతియుతంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఈద్గాలో జరుపుకునే ప్రార్థనల ద్వారా అల్లా ఆశీస్సులు పొందాలని కోరారు.





సంక్షేమ పాలనకే ప్రజల మద్దతు

● పార్టీలకతీతంగా సీఎం జగన్‌కు ఆదరణ ● రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ● కట్టమూరులో 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్'

సత్తెనపల్లి: అన్ని వర్గాలకు ఆర్థిక భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమ పాలనకే ప్రజల మద్దతు లభిస్తోందని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. 'జగనన్నే మా భవిష్యత్.. మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమంలో భాగంగా సత్తెనపల్లి మండలం కట్టమూరులో శుక్రవారం పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీసి ప్రజా మద్దతు పుస్తకంలోని ఐదు ప్రశ్నలను ఇంటిలోని సభ్యులను అడిగి వారి అభిప్రాయాలను సేకరించారు. మంత్రి మాట్లాడుతూ పాలనపరంగాను, పార్టీ బలోపేతానికి సంస్కరణలు, సాహసోపేతమైన నిర్ణయాలతో సంచలనం సృష్టిస్తున్న యువ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి తలపెట్టిన జగనన్నే మా భవిష్యత్‌కు విశేష ఆదరణ లభిస్తుందన్నారు. నవరత్న పథకాల తో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుకుంటున్న లబ్ధిదారులు జగనన్న పాలనకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నారని వివరించారు. మరోసారి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని ప్రగాఢ విశ్వాసంతో చెబుతున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి రూరల్ కన్వీనర్ రాయపాటి పురుషోత్తమరావు, రాష్ట్ర రైతు సలహా మండలి సభ్యుడు కళ్లం విజయభాస్కర్ రెడ్డి, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, జేసీఎస్ ఇన్‌చార్జి బూతుకూరి వెంకటరెడ్డి, జిల్లా యువజన విభాగం కార్యదర్శి చిలుకా జయపాల్, నాయకులు షేక్ ఎలవర్తిపాటి ఈసా, సంకటి శ్యాంసన్, మందడపు పృద్వీ, సర్పంచ్ కొండలు, మాజీ సర్పంచ్‌లు దావీదు, రోశయ్య, ఎంపిటిసి సభ్యులు గోపయ్య, మాగంటి నరసింహారావు పాల్గొన్నారు.



వృద్ధురాలికి సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

వెయిట్ లిఫ్టింగ్‌లో స్టేడియం లిఫ్టర్లకు జాతీయ పతకాలు



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈ నెల 15న హైదరాబాద్‌లో జరిగిన సౌత్‌జోన్ మాస్టర్స్ జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో స్థానిక బీఆర్ స్టేడియంలోని హెల్త్‌క్లబ్ జిమ్‌కు చెందిన లిఫ్టర్లు బంగారు పతకాలు సాధించారని డీఎస్ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వి.దుర్గా ప్రసాద్, కె.నాగరాజు, బీవీఎల్ నరసింహారావు, ఎం.శ్రీనివాస్ కుమార్ మొత్తం నాలుగు బంగారు పతకాలు గెలుపొందారని చెప్పారు. ఈ సందర్భంగా కోచ్ కమురుద్దీన్, పతకాలు సాధించిన లిఫ్టర్లను సత్కరించామని వెల్లడించారు.

గుంటూరులో సీఏటీని ఏర్పాటు చేయండి

– కేంద్ర న్యాయ శాఖ మంత్రికి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు విజ్ఞప్తి

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): కేంద్రప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, పదోన్నతులు, పెన్షన్ సమస్యలు, బకాయిల వివాదాల పరిష్కారానికి రాజ్యాంగబద్ధంగా ఉన్న సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (సీఏటీ)ని ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో ఏర్పాటు చేయాలని కేంద్ర న్యాయశాఖ మంత్రి కిరణ్ రిజిజును నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఏపీలో ఇప్పటికీ క్యాట్ బెంచ్ లేదని, ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న బెంచ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రెండు రాష్ట్రాల్లోని.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు సేవలు అందిస్తోందని, ఏపీలోనే 50,000 మందికిపైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఉన్నారని, క్యాట్ బెంచ్ లేకపోవడం వల్ల వీరు ఇబ్బంది పడుతున్నారని, వారి కష్టాలను దృష్టిలో ఉంచుకుని, గుంటూరు జిల్లాలో శాశ్వత క్యాట్ బెంచ్‌ను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఎంపీ కేంద్రమంత్రికి విన్నవించారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

ఎంతో పుణ్యకార్యం ఇఫ్తార్ విందు

వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని నియమ నిష్ఠలతో ఉపవాసాలు ఆచరించే ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం పుణ్యకార్యమని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పట్టణంలోని అబ్బాసనగర్‌లో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ బషీర్ మేస్త్రి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా మంత్రి విడదల రజిని పాల్గొన్నారు. ముందుగా ముఫ్తీ అనస్‌ఖాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి రజిని మాట్లాడుతూ పవిత్ర రంజాన్ దినాలలో భక్తి శ్రద్ధలతో కఠోర ఉపవాస దీక్షలుండే వారిని గౌరవించి, అనుసరించాలని పవిత్ర గ్రంథం ఖురాన్ బోధిస్తుందని వెల్లడించారు. అలా చేసే వారిపై దైవం ఎనలేని అనుగ్రహ భాగ్యాలను వర్షిస్తాడని ఇస్లామిక్ పండితులు చెబుతారని పేర్కొన్నారు. ఇతరుల ఆకలి, దప్పికల బాధను తెలిపే ఉపవాసాలంటే అల్లాహ్‌కు ఎంతో ప్రియమని వివరించారు. ప్రభుత్వం ముస్లిం సంక్షేమానికి కట్టుబడి ఉందని చెప్పారు. నాడు మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. అలాగే ఆయన తనయుడు నేటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల సంక్షేమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపి, భోజనాలు వడ్డించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యులు కోడే సుధారాణి, కాట్రగడ్డ మస్తాన్‌రావు, రాష్ట్ర ముస్లిం కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ దరియావలి, వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ అల్లీమియా, పట్టణ అధ్యక్షుడు బేరింగ్ మౌలాలి నాయకులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

నరసరావుపేట ఈస్ట్: పదో తరగతి పశ్నపత్రాల మూల్యాంకనం విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం వీరవట్నం గ్రామ ప్రాథమికోన్నత పాఠశాలలో బి.జోజప్ప(50) పనిచేస్తున్నాడు. మూల్యాంకనానికి స్పెషల్ అసిస్టెంట్ విధులకు సెయింటాన్స్ పాఠశాలకు వచ్చారు. ఉదయం పూట విధులను ముగించుకొని భోజనానంతరం విధులకు హాజరయ్యారు. కొద్దిసేపటికే ఒక్కసారిగా కుప్పకూలిపోవటంతో తోటి ఉపాధ్యాయులు జోజప్పను దగ్గరలోని ప్రైవేటు హాస్పటల్‌కు తీసుకవెళ్లారు. చికిత్స పొందుతూ జోజప్ప మృతి చెందినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. జోజప్ప స్వగ్రామం ఫిరంగిపురం. 2002 డీఎస్సీలో ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. జోజప్ప మృతికిజిల్లా విద్యాశాధికారి కె.శామ్యూల్, డెప్యూటీ డీఈఓ వేణుగోపాలరావు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. ఉపాధ్యాయులు వత్తిడికి గురికావలసిన పనిలేదన్నారు. మూల్యాంకనానికి 150 శాతం మంది ఉపాధ్యాయులకు స్పాట్ ఆర్డర్లు ఇచ్చామని తెలిపారు. అనారోగ్యంతో ఉన్న ఉపాధ్యాయులను విధులనుంచి మినహాయింపు ఇచ్చామని వివరించారు.

రాష్ట్ర స్థాయిలో పవర్ లిఫ్టింగ్ పోటీలకు జట్టు ఎంపిక

సత్తెనపల్లి: రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చూపి పల్నాడు జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ పల్నాడు జిల్లా సెక్రటరీ పసుపులేటి సురేష్ ఆకాంక్షించారు. పట్టణంలోని పవర్ హౌస్ ఫిట్నెస్‌లో రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు పల్నాడు జిల్లా నుంచి శుక్రవారం ఎంపికలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్య వహించనున్నట్లు పేర్కొన్నారు. సబ్ జూనియర్, జూనియర్, మాస్టర్స్ మెన్ అండ్ ఉమెన్ ఎక్విప్డ్ జరుగుతాయన్నారు. సబ్ జూనియర్స్‌లో 53 కేజీల్లో కె.కార్తీక్(గురజాల), 66 కేజీల్లో షేక్ కరీం (సత్తెనపల్లి), జూనియర్ విభాగంలో 52 కేజీల్లో ఎం.అనూష (కారెంపూడి), 53 కేజీల్లో షేక్ గౌస్(సత్తెనపల్లి), 59 కేజీల్లో ప్రాన్సిస్(సత్తెనపల్లి), 59 కేజీల్లో సౌరబ్(సత్తెనపల్లి), 66 కేజీల్లో ఎస్.శరత్(వెన్నాదేవి), 74 కేజీల్లో పి.వంశీకృష్ణ(సత్తెనపల్లి), 74 కేజీల్లో ఎస్.ఈశ్వర్(సత్తెనపల్లి), 93 కేజీల్లో పి.అశోక్(సత్తెనపల్లి), 120 కేజీల్లో ఎల్.శివ నాగేశ్వరరావు(గుడిపూడి), మాస్టర్స్ విభాగం నుంచి 105 కేజీల్లో కె.జ్యోతి బాబు(గురజాల) నుంచి ఎంపికయ్యారు. కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జిమ్ రాజు, గుజ్జర్లపూడి ఆనంద్, జి.రమేష్, ఎస్.మణిరత్నం, టి.శంకర్, కత్తి పవన్ కుమార్, షేక్ జానీ, సయ్యద్ మస్తాన్, పి.విశ్వనాథ్, ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాతంగి సాంబశివరావు, శాంతయ్య పాల్గొన్నారు.

భూరక్ష పథకాన్ని వేగవంతం చేయాలి

కలెక్టర్ శివశంకర్ లోతేటి

నరసరావుపేట రూరల్: వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూ రక్ష పథకం కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. మండలంలోని గుంటగార్లపాడు, వల్లప్పచెరువు ప్రాంతాల్లో జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష పథకంలో చేపట్టిన హద్దురాళ్ల ఏర్పాటును శుక్రవారం ఆయన పరిశీలించారు. చెరువు విస్తీర్ణం కొలతలు తీసిన తీరు, హద్దురాళ్లు వేస్తున్న ప్రాంతం, పనులు జరుగుతున్న తీరును జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా తొలి విడతలో 70గ్రామాల్లో 1,39,633.58 ఎకరాల్లో హద్దు రాళ్లు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఇందుకోసం 2,08,386 హద్దురాళ్లు ఏర్పాటు చేయాల్సి ఉందని ప్రభుత్వానికి నివేదికలు పంపామన్నారు. ఇప్పటికి 1,58,910 హద్దురాళ్లు ప్రభుత్వం జిల్లాకు అందజేసినట్టు తెలిపారు. అందులో 69,897 హద్దురాళ్లు వేయడం జరిగిందన్నారు. హద్దురాళ్లు ఏర్పాటు పనుల్లో వంద టీంలు పనిచేస్తున్నాయని కలెక్టర్ వివరించారు. ఈ టీంలు 50 కోవర్ల ద్వారా రోజుకు 4,500 హద్దురాళ్లు వేసేందుకు మార్కింగ్ చేస్తున్నట్టు తెలిపారు. ఒక్కో రోజుకు 3500 హద్దురాళ్లు లక్ష్యం కాగా సుమారు 50 టీమ్‌లు 3400 హద్దురాళ్లు వేస్తున్నారని తెలిపారు. ఏడు గ్రామాల్లో హద్దురాళ్లు వేసే కార్యక్రమం తుది దశకు చేరుకుందన్నారు. మిగిలిన 67 గ్రామాల్లో ఈ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. మరో 25 రోజుల పాటు హద్దురాళ్లు వేసే కార్యక్రమం కొనసాగిస్తామన్నారు. మే 25 నాటికి హద్దురాళ్లు ఏర్పాటు కార్యక్రమాన్ని తప్పనిసరిగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పనుల నిర్వహణలో ఎక్కడా నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. పనుల్లో జాప్యం లేకుండా చూడాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాన్ని వంద శాతం నిర్దిష్ట గడువులో పూర్తిచేయాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ ఎం.శేషిరెడ్డి, తహసీల్దార్ రమణానాయక్ పాల్గొన్నారు.



హద్దురాళ్లు వేసే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

సేద్యం అభివృద్ధికి సమష్టి కృషి

గుంటూరు రూరల్: వ్యవసాయ రంగం అభివృద్ధికి శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ అధికారులు సమష్టిగా కృషిచేయాల్సిన అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ, మార్కెటింగ్ అడ్వైజర్ బి.బ్రహ్మనందరెడ్డి చెప్పారు. నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలో పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్.ప్రశాంతి అధ్యక్షతన జరిగిన ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, కృష్ణ జిల్లాల (కృష్ణ మండలం) వ్యవసాయ పరిశోధన, విస్తరణ, సలహా మండలి సమావేశం శుక్రవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బ్రహ్మనందరెడ్డి మాట్లాడుతూ దేశాభివృద్ధిలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పాత్రను అభినందించారు. క్షేత్రస్థాయిలో రైతుల వద్దే విత్తనోత్పత్తికి ప్రోత్సాహం అందించాలని అధికారులకు సూచించారు. ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి మాటాడారు. కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి, లాంఫాం ఏడీఆర్ డాక్టర్ జి సుబ్బారావు, గుంటూరు, పల్నాడు, కృష్ణ, ఎన్టీఆర్, ప్రకాశం, బాపట్ల జిల్లాల వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

